సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం ౹ 25 ౹ సెప్టెంబర్ ౹ 2023



పుస్తకాలొచ్చాయ్..
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే రెండోవిడత పుస్తకాలు జిల్లాకు చేరాయి.
వివరాలు 8లో ▸



గొర్రవరి ఎండింది..
నడిగడ్డలో ధర్మపంటగా పేరొందిన గొర్రవరి వర్షాభావ పరిస్థితులతో ఎండుముఖం పట్టింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.2 /24.1
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'వందేభారత్' గద్వాలలో ఆపేందుకు కృషి

గద్వాల రూరల్: వందేభారత్ రైలును గద్వాలలో ఆపేందుకు కృషి చేస్తానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్, కర్నూల్ రైల్వేస్టేషన్లలో ఆగుతూ వాటి మీదుగా నూతనంగా వందేభారత్ రైలును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈరైలును గద్వాలలో కూడా ఆపేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు.

నేడు బాల్ బాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈ నెల 25న ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ బాల, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు 02-01-2008 తర్వాత జన్మించి ఉండాలని, ఆధార్‌కార్డు, సొంత రాకెట్, షూ, డ్రెస్‌తో పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఎంపికైన బాల బాలికల జట్లు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3 వరకు ఆర్మూర్‌లో జరగబోయే 42వ సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ ఇంటర్ స్థాయి జిల్లా టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకి చెందిన కాలిదాసు, లలిత దంపతుల కుమార్తె వైష్ణవి హైదరాబాద్‌లో నిర్వహించిన 21వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందించారు. వైష్ణవి 8వ తరగతి చదువుతుందని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించి పార్టీ అభివృద్ధి కోసం కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అబ్దుల్ అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో మండల అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై నాయకులతో కలిసి ప్రధాని మోడీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మండల స్థాయి, పోలింగ్ బూత్ నాయకులు పార్టీకి టైమ్ కేటాయించి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీసిరెడ్డి, అశోక్, శంకర్‌రెడ్డి, మద్దిలేటి, రవి, శారద, రంజిత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ లంపీ స్కిన్ కలకలం

దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తున్న వ్యాధి
- జిల్లాలో 128 దూడల్లో వ్యాధి లక్షణాలు గుర్తింపు
- అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ అధికారులు
- పాడి రైతుల్లో ఆందోళన



కేటీదొడ్డి మండలం మల్లాపురంలో పశువుకు గోట్‌పాక్స్ టీకా వేస్తున్న సిబ్బంది

గద్వాల వ్యవసాయం: జిల్లాలోని పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి మళ్లీ ప్రబలుతోంది. ఏడాది క్రితం వ్యాధి నివారణ భాగంగా పశుసంవర్ధకశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పశువులకు గోట్‌పాక్స్ టీకా వేయడంతో తగ్గుముఖం పట్టింది. అయితే గడిచిన 25 రోజుల నుంచి వ్యాధి మళ్లీ ప్రబలడం ప్రారంభం అయ్యింది. ప్రధానంగా దూడల్లో ఎక్కువగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీంతో పశుసంవర్ధశాఖ అప్రమత్తమై గత కొద్ది రోజుల నుంచి వ్యాక్సినేషన్ చేస్తోంది.

ఏడాది క్రితం గుర్తింపు

మొదట గుజరాత్, మహారాష్ట్రలలో ఏడాది క్రితం ఈ వ్యాధిని గుర్తించారు. సంతల్లో, మార్కెట్‌లలో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఒక రాష్ట్రం రైతులు మరో రాష్ట్రానికి వెళ్లి పశువులను కొనుగోలు చేస్తుంటారు. ఈక్రమంలో మన రాష్ట్రంలోనూ ఏడాది క్రితం పలు ప్రాంత్రాల్లో పశువులకు ఈవ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. ఈక్రమంలో గడిచిన ఏడాది సెప్టెంబర్‌లో లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పశువుల్లో అగుపించాయి. పశుసంవర్ధకశాఖ అప్రమత్తమై తెల్లజాతి పశువులు లంపీ స్కిన్ వ్యాధి బారిన పడకుండా ప్రత్యేకంగా మండలాల వారీగా బృందాలను నియమించి ముందస్తుగా గోట్‌పాక్స్ టీకాలను పశువులకు వేయించింది. ఇదిలా ఉంటే జిల్లాకు ఏపీ, కర్ణాటకలు సరిహద్దు రాష్ట్రాలుగా ఉన్నాయి. ఈరాష్ట్రాల నుంచి తీసుకొచ్చే పశువులకు వ్యాధి ఉంటే ఇక్కడికి తీసుకొచ్చిన తర్వాత ఇతర పశువులకు సంక్రమించే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో అధికారులు అప్పుడు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇలా పలు చర్యలు తీసుకొని వ్యాధి ప్రబలకుండా అరికట్టారు.

వ్యాధి లక్షణాలు..

లంపీ స్కిన్ (ముద్దచర్మ వ్యాధి) క్యాప్రీ పాక్స్ అనే వైరస్ నుంచి వస్తుంది. ఆవులు, ఎద్దులు, లేగదూడల్లో ఈవ్యాధి సోకుతోంది. బాహ్య పరాన్న జీవులు, వ్యాధి ఉన్న పశువు తాగిన నీరు, తిన్న గడ్డి వల్ల ఇతర పశువులకు ఈవ్యాధి సంక్రమిస్తుంది. 104 నుంచి 106 డిగ్రీల జ్వరం, మేత మందగించడం, చర్మంపై బొబ్బలు రావడం వ్యాధి ప్రధాన లక్షణాలుగా చెప్పవచ్చు.



ఉండవల్లి మండలం పుల్లూరులో టీకా వేస్తున్న దృశ్యం

జిల్లాలో పశువుల వివరాలిలా..

మండలం	పశువుల సంఖ్య	మండలం	పశువుల సంఖ్య
ధరూరు	7,378	మానవపాడు	3,548
మల్దకల్	7,134	రాజోళి	3,506
అయిజ	6,903	వడ్డేపల్లి	3,294
గట్టు	6,894	కేటీదొడ్డి	3,195
గద్వాల	6,207	అలంపూర్	1,880
ఇటిక్యాల	4,628	ఉండవెల్లి	1,731
		మొత్తం	56,298

లంపీ స్కిన్ లక్షణాలున్న పశువుల వివరాలిలా..

మండలం	దూడలు	మండలం	దూడలు
గట్టు	21	అయిజ	8
అలంపూర్	18	రాజోళి	8
ధరూర్	17	వడ్డేపల్లి	6
గద్వాల	14	కేటీదొడ్డి	5
ఉండవెల్లి	12	మానవపాడు	4
ఇటిక్యాల	12	మల్దకల్	3

దూడల్లో వ్యాధి లక్షణాలు

గత నెల రోజుల నుంచి మళ్లీ లంపీ స్కిన్ వ్యాధి కలకలం రేపుతోంది. పెద్ద ఆవులు, ఎద్దులతో పాటు, ప్రధానంగా ఏడాది వయస్సు ఉన్న లేగదూడల్లో వ్యాధి లక్షణాలు కనిపించాయి. గడిచిన ఏడాది చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమం సమయానికి ఇవి జన్మించలేదు. ఇదీ కూడా ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న లేగదూడలను మండలాలు, గ్రామాల వారీగా 128 ఉన్నట్లు గుర్తించారు. ఇదే సమయంలో కొన్ని చోట్ల ఆవుల్లో, ఎద్దుల్లో కూడా వ్యాధి లక్షణాలు గుర్తించారు. వ్యాధి అరికట్టే చర్యలను పశుసంవర్ధశాఖ గడిచిన ఇరవై రోజుల నుంచి ఆరంభించింది. పశువులకు ముందస్తుగా గోట్‌పాక్స్ టీకాలు వేస్తున్నారు. టీకా వేయడంతో పాటు, పశువులు వ్యాధి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు తెలియజేస్తున్నారు.

టీకాలు వేస్తున్నాం



పశువులు లంపీ స్కిన్ వ్యాధి బారిన పడకుండా జిల్లాలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఏడాదిలోపు వయస్సు ఉన్న లేగదూడల్లో లక్షణాలు గుర్తించాం. వాటికి టీకాలు వేయడంతో పాటు, ముందస్తుగా పశువులకు గోట్‌పాక్స్ టీకా వేస్తున్నాం.
– డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖాధికారి

ఐటీ ఉద్యోగాలకు కేరాఫ్ పాలమూరు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు అంటే లేబర్ జిల్లా కాదని.. ఐటీ ఉద్యోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన దివిటిపల్లి ఐటీ కారిడార్‌లో ముల్లర్ డాట్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో యూఎస్ అకౌంటింగ్‌లో శిక్షణ పొందిన 140 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు పాలమూరు అంటే వలసల జిల్లాగా ప్రపంచ వ్యాప్తంగా పేరు ఉండేదని, పంటలు పండని జిల్లాగా, తాగునీరు లేని అందని ప్రాంతంగా పేరొందిందన్నారు. ఇప్పుడు పాలమూరును అభివృద్ధి పథంలో ఊహించని స్థాయిలో ముందుకు తీసుకెళ్తున్నామని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. విద్య, వైద్యం, ఆరోగ్యం అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే కేసీఆర్ అర్బన్ ఎకో పార్కులో జంగిల్ సఫారీ, బర్డ్స్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభిస్తామన్నారు. దివిటిపల్లిలో 400 ఎకరాల్లో ఐటీ పార్కు ఏర్పాటు చేశామని, ఇక్కడ యువతకు ఇక్కడే ఉద్యోగాలు ఇవ్వాలన్న సంకల్పంతో గట్టిగా కృషి చేస్తున్నామని, గతంలో జిల్లాను పాలించిన వారు దత్తత తీసుకున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలతోపాటు పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయన్నారు. అకౌంటెన్సీలో ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు ఉన్న ముల్లర్ డాట్ కనెక్ట్ సంస్థ మన ఐటీ కారిడార్‌లో స్థానిక నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ముల్లర్ డాట్ కనెక్ట్ సంస్థ సీఎంఏ భాను ప్రకాష్, సుశాంత్, సందీప్, శరత్, వైస్ ఎంపీపీ అనిత, దివిటిపల్లి సర్పంచ్ జరీనా, రైతుబంధు డైరెక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

గణనాథుడికి విశేష పూజలు



గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

- భక్తులకు అన్నదానాలు
- మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు
- పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే
- కొనసాగిన నిమజ్జనోత్సవాలు

గద్వాల: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన గణేష్ మండపాలలో నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆయా మండపాలలో కొలువుదీరిన గణనాథులు గత వారం రోజులుగా భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నారు. విఘ్నాలు తొలగించే వినాయకుడిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు సైతం రోజుకో పద్ధతిలో పూజలు నిర్వహిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. వినాయకులను ప్రతిష్ఠించిన ఉత్సవ కమిటీలు రోజువారి పూజలతో పాటు, ఆయా ప్రాంతాల నిర్వాహకులు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆదివారం స్థానిక న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్ అన్నదానం ప్రారంభించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో వార్డు కౌన్సిలర్లు వేరువేరుగా గణనాథునికి పూజలు నిర్వహించారు.



నిమజ్జనానికి తరలుతున్న గణేష్ మండపం ఎదుట చిన్నారుల సందడి

నయనానందం.. వినాయక నిమజ్జనం..

బోలో గణేష్ మహారాజ్ కీ జై.. గణపతి బప్పా మోరియా.. అంటూ భక్తుల నినాదాలతో గద్వాల పుర వీధులు పులకించాయి. ఏడు రోజుల పాటు భక్తుల అశేష పూజలందుకున్న వినాయకుడు తల్లి ఒడికి చేరుకున్నాడు. జిల్లా కేంద్రంలోని ఆయా వీధుల్లో ప్రతిష్ఠించిన గణనాథులలో కొన్ని విగ్రహాలను ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. వివిధ ఆకృతులలో ఏక దంతుడిని తీర్చిదిద్దిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో చిన్నారులు, మహిళలు, యువకుల నృత్యాలు, భజనలతో కోలాహలంగా సాగింది.

వందేభారత్‌కు ఘన స్వాగతం

- మధ్యాహ్నం 2.15 గంటలకు మహబూబ్‌నగర్ స్టేషన్‌కు చేరుకున్న రైలు



వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న డీకే అరుణ, జితేందర్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్– బెంగుళూర్ (కాచిగూడ– యశ్వంత్‌పూర్) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో లింక్ ద్వారా వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. కాచిగూడ నుంచి ప్రారంభమైన వందేభారత్ రైలు మధ్యాహ్నం 2.15 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ స్టేషన్‌కు చేరుకుంది. ప్రారంభోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ స్టేషన్‌లో సందడి వాతావరణం నెలకొంది. వందేభారత్ రైలు స్వాగత కార్యక్రమంలో విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్టేషన్‌కు రైలు చేరుకోగానే ఘనంగా స్వాగతం పలికి రైలు ఎదుట సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీనియర్ డీఎస్ఓ వెంకటకుమార్, ఏడీఎస్‌టీఈ భాస్కర్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వందేభారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా మీదుగా వందేభారత్ రైలు ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. పీఎం నరేంద్రమోదీ తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం వందేభారత్ రైలు ప్రారంభించారని, ఈ రైలును ఉమ్మడి జిల్లా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వందేభారత్ రైలు ఎంతో సౌకర్యం ఉందని, ఏరో ప్లేన్‌లో ఉండేలా ఉందన్నారు. ఈ రైలులో ఎన్నో సదుపాయాలు కల్పించారని, మహబూబ్‌నగర్ స్టేషన్‌లోనూ ఆధునీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వందేభారత్ రైలును చూడడానికి వచ్చిన విద్యార్థులు, ప్రజలు

భద్రత కట్టుదిట్టం

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాల అధికారులతో సమావేశం
- చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు
- అక్రమ మద్యం, నగదు, నిషేధిత వస్తువుల రవాణాకు అడ్డుకట్ట



ఎస్పీ కార్యాలయంలో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులతో సమావేశమైన డీఐజీ చౌహాన్ (ఫైల్)

గద్వాల క్రైం: త్వరలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులే లక్ష్యంగా పోలీసు శాఖ భద్రత కట్టుదిట్టం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల పోలీసు శాఖ అధికారులతో ఈ నెల 8వ తేదీన మల్టీజోన్– 2 డీఐజీ చౌహాన్ సైతం ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాకు మూడు రాష్ట్రాల సరిహద్దులు కావడంతో మద్యం, నగదు, మాదకద్రవ్యాలు అక్రమంగా సరఫర చేసే వెసులుబాటు ఉంటుందనే నిఘా వర్గాలు బహిర్గతం చేసినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా ఓటర్లకు పెద్ద మొత్తంలో నగదు, వస్తు సామగ్రి, మద్యం తదితర వాటితో తమ వైపునకు ఆయా పార్టీల నాయకులు తిప్పుకుంటారనే గుర్తించారు. ఎన్నికలు సజావుగా సాగాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ముందుస్తు చర్యలకు శ్రీకారం చేపట్టింది. గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల మీదుగా మూడు రాష్ట్రాల సరిహద్దుల వద్ద ఏడు చెక్‌పోస్టులను గుర్తించారు. తెలంగాణా వెలుపలికి అనుమతి లేకుండా వచ్చే మద్యం, నగదు, మాదకద్రవ్యాల సరాఫర చేసే ముఠాకు చెక్ పేట్టేందుకు పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశం

ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణా పోలీసుశాఖ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి 2018లో నమోదైన కేసులు, పట్టుబడిన నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, నిందితులు తదితర విషయాలపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతాల నుంచి గుట్టుగా మన రాష్ట్రంలోకి నిషేధిత వస్తువులు, మద్యం, నగదు సరాఫరా చేస్తున్నారు. ఏ చెక్ పోస్టులను దాటుకుని వస్తున్నారు. ఇతర రోడ్డు మార్గాలలో ఇక్కడికి వాటిని తరలిస్తున్న క్రమంలో నిలువరించేందుకు చూసి చూడనట్లు వ్యవహరించిన సిబ్బంది ఉన్నారా.. అనే కోణంలో ఆరా తీశారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకునేలా ఎన్నికల నిబంధనలు, చట్టాలపై విస్తృతంగా ఓటర్లకు తెలిసేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. అయితే చెక్‌పోస్టుల వద్ద గతంలో విధులు నిర్వహించిన సిబ్బంది జాబితాను సైతం డీఐజీ కోరినట్లు సమాచారం. చెక్‌పోస్టులను దాటుకుని అక్రమంగా అనుమతి లేని వస్తువులు, నగదు, మద్యం మన ప్రాంతాల్లో పట్టుబడితే అక్కడి సిబ్బందిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది.

సమస్యాత్మక గ్రామాలు, చెక్‌పోస్టులపై నిఘా

2018 ఎన్నికల సమయంలో సరిహద్దుల్లో రూ.1.50కోట్లు నగదు పట్టుకున్నారు. అలాగే, 1,682 లీటర్ల మద్యం, కారు, నాలుగు కేజీల బంగారం, 1500 సిల్వర్, 350 చీరాలు, 55 కేసులలో 88 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలాఉండగా, రాష్ట్రానికి సంబంధించి నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులతో పాటు సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచారు. జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు, కర్నాటక సరిహద్దులో రెండు చెక్‌పోస్టులు, నారాయణపేట, కర్నాటక సరిహద్దులో ఏడు చెక్‌పోస్టులు, రాయచూర్, యాద్గిరి, కర్నూల్, నంద్యాల జిల్లా సరిహద్దుల వద్ద పకడ్బందీగా సోదాలు చేయనున్నారు. ఎన్‌బిడబ్ల్యూ వారెంట్ విషయంలో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు పరస్పర సహాయ సహకారాలు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయి. హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ చేస్తు అప్రమత్తంగా ఉండేలా వివరించారు. సామాజిక మాద్యమాల్లో ఇరు రాష్ట్రాల సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

అక్రమ రవాణాకు చెక్



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ నిఘా ఏర్పాటుచేయనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో చర్చించాం. అవసరమయ్యే సిబ్బందిచే నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేపడతాం. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాం. ఎన్నికల నియమావళి, నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తాం. – సృజన, ఎస్పీ

రైతాంగ చరిత్రను వక్రీకరిస్తున్నారు'



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రైతాంగ పోరాటంతో సంబంధం లేని పార్టీలు, సంస్థలు చరిత్రను వక్రీకరిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, రైతు సంఘం నాయకులు ఎ.రాములు, కె.గోపాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆదివారం తెలంగాణ సాహితీ, టీపీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అంశంపై జనకవనం నిర్వహించారు. వేలాది మంది రైతాంగం ఎర్రజెండా అండదండలతో సాయుధ పోరాటం జరిపిన తీరును వివరించారు. గాయకులు శ్యామల, నర్సింహులు పాడిన పాటలు అలరించాయి. కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన్, జిల్లా సలహాదారులు పరిమళ్, టీపీఎస్‌కే రాష్ట్ర ఉపాధ్యక్షులు కురుమూర్తి, ఖాజామైనొద్దీన్, బస్వరాజప్ప, ప్రమోద్‌కుమార్, కాళిదాసు, శ్యామల, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిలిచిన డీసీఎంను బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీలో గల చెక్‌పోస్టులో ఆదివారం సాయంత్రం రోడ్డుపై నిలిచిన డీసీఎంను ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా.. మక్తల్ వైపు నుంచి రాయచూర్‌కు వెళ్లేందుకు చెక్‌పోస్టులో డీసీఎం నిలిపారు. అదే సమయంలో ఓ బైక్ అతి వేగంతో డీసీఎంను వెనుక వైపు బలంగా ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. కర్ణాటకకు చెందిన వ్యక్తి అయి ఉంటాడని, ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

తిరుమలలో నారాయణపేట వాసి..

నారాయణపేట: తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు జిల్లా కేంద్రంలోని బహార్‌పేట వీధి నుంచి బయలు దేరిన కొందరు భక్తుల్లో ఒక వ్యక్తి ఆదివారం ఉదయం క్యూలైన్‌లోనే గుండెపోటుతో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిపై పని చేస్తున్న నర్సప్ప (60)తో పాటు మరి కొందరు శనివారం తిరుపతికి రైలులో బయలుదేరారు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తుండగా నర్సప్ప అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య గోవిందమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు దుకాణం దగ్ధం

రాజోళి: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు దుకాణం దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన హనుమంతు గాంధీచౌక్ లో చికెన్ అమ్ముతూ, చేపలు వండుతూ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో దుకాణంలో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఖాదర్ భాషా ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక ఉప సర్పంచ్ గోపాల్‌తో కలిసి నీటి ట్యాంకర్ల ద్వారా మంటలను అదుపు చేశారు. అప్పటికే మొత్తం కాలిపోయింది. అందులో సిలిండర్లు, వంట సామాను, రూ.20వేల నగదు ఉండటంతో అవి పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జనాభా దమాషా ప్రకారం యాదవులకు వాటా

భూత్పూర్: జనాభా దమాషా ప్రకారం యాదవులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో వాటా ఇవ్వాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యాదవులతో సమావేశం, మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా ధనుంజయ్, ప్రచార కార్యదర్శి రెడ్డికుంట వెంకటేష్, నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా అర్వ విజయకుమార్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలు యాదవ్ మాట్లాడుతూ యాదవులకు రాజకీయంగా గాని, బడ్జెట్‌లో నిధులు దామాషా ప్రకారం కేటాయించడం లేదని, 2011 ఎన్నికల జనాభా ప్రకారం 18శాతం యాదవులకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వాలు మొండి వైఖరి అవలంభిస్తున్నాయని ఆయన ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం 22 ఎమ్మెల్యేలు, 5 ఎమ్మెల్సీలు, 2 రాజ్యసభ స్థానాలు కేటాయించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పన్ను తొలగించాలని, ఎస్ఎస్టీ రిజర్వేషన్లు పునరుద్ధరించాలని అభిప్రాయపడ్డారు. యాదవులు తమంతట తాము బలోపేతం కావాల్సిన సమయం ఆసన్నమైనదని, నాయకత్వం లేకపోవడంతోనే ఎదగలేకపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో జర్రు నారాయణయాదవ్, అంజన్న యాదవ్, మద్దిలేటి, రవికుమార్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలొచ్చాయ్..

జిల్లాల గోదాంలకు చేరిన రెండో దశ పుస్తకాలు

- ఒకే పుస్తకంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం ప్రింటింగ్
- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో 3,168 పాఠశాలల్లో 2.80 లక్షల మంది విద్యార్థులు



8వ తరగతి పుస్తకంలో రెండు భాషల్లో ముద్రించిన పుస్తకం, బార్‌కోడ్



ఆర్టీసీ కార్గోలో మహబూబ్‌నగర్ జిల్లా గోదాంకు చేరిన పుస్తకాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం వినూత్న విధానాలతో ముందుకెళ్తుంది. ప్రారంభం నుంచి ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో చదివిన విద్యార్థులకు పుస్తకాల విషయంలో గందరగోళంగా ఉండేది. కొంత మందికి తెలుగు పుస్తకాలు అర్థం అయితే, కొంత మందికి ఇంగ్లిష్ మీడియం అర్థమయ్యేది. ఈ గందరగోళానికి తెరదించేలా ప్రభుత్వం వినూత్న ఆలోచనలతో తెలుగు, ఇంగ్లిష్ మీడియం పుస్తకాలను ముద్రించింది. ఈ క్రమంలో జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమైనప్పుడు ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ మొదటి విడత పుస్తకాలను పంపిణీ చేశారు. ఇప్పుడు రెండో విడత పుస్తకాలను పంపిణీకి సిద్ధం అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లాలకు దాదాపు 80శాతానికి పైగా పుస్తకాలు చేరుకున్నాయి. భాషలు తప్ప అన్ని పుస్తకాలు వచ్చాయి. వారం రోజుల్లో మొత్తం పుస్తకాలు గోదాంలకు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,168 పాఠశాలల్లో 2.80 లక్షల మంది విద్యార్థులకు ఒకసారి పంపిణీ చేయాలంటే సుమారు 6.20 లక్షల పుస్తకాల అవసరం. ఇందులో 80శాతం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

రెండు సార్లు పంపిణీ ఎందుకు?

ప్రతి సంవత్సరం ఒకే సారి ప్రభుత్వం పుస్తకాలను పంపిణీ చేస్తుంది. కానీ ఈ సంవత్సరం రెండు సార్లు పుస్తకాలను ఎందుకు పంపిణీ చేస్తుందని చాలా మందికి సందేహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 8వ తరగతి సాంఘిక పుస్తకంలో 300 పేజీలు ఉన్నాయి. దీన్ని ఈ సంవత్సరం మొదట పంపిణీ చేసినప్పుడు 150 పేజీలను తీసుకుని ఒక సిలబస్‌లో ఒక అంశానికి సంబంధించి ఒక వైపు పేజీలో తెలుగులో, మరో వైపు పేజీలో ఇంగ్లిష్‌లో ముద్రించారు. దీంతో ఒక అంశాన్ని తెలుగులో, ఇంగ్లిష్‌లో చదివి అర్థం చేసుకునేందుకు వెసలుబాటుగా ఉంది. 150 పేజీల పుస్తకం కాస్త 300 పేజీలకు పెరిగింది. రెండో దశ పంపిణీ చేసే పుస్తకాలలో మిగిలిన 150 పేజీల పుస్తకాన్ని ఇప్పుడు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. అయితే ప్రస్తుతం 1 నుంచి 9వ తరగతుల వారికి సబ్జెక్టు పుస్తకాలు మాత్రమే ఇవ్వనున్నారు. 10వ తరగతి విద్యార్థులకు మొదట ఇచ్చిన కారణంగా ప్రస్తుతం పంపిణీ చేయడం లేదు.

సులువుగా అర్థమయ్యేలా..

పుస్తకాన్ని ఏ మీడియంలో చదువుకున్న విద్యార్థులు అయిన సులువుగా చదువుకుని అర్థం చేసుకునే విధంగా రెండు భాషల్లో ముద్రించారు. దీంతో ఉపాధ్యాయులకు సైతం భాష సమస్య లేకుండా బోధించే వీలుంది. వీటితో పాటు పుస్తకంలోని ఏ అంశాన్నయిన వీడియో రూపంలో తరగతులు వినాలి అనుకునే వారి కోసం పుస్తకం చివరన బార్ కోడ్‌ను ముద్రించారు. దీన్ని స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే పుస్తకంలోని అన్ని అంశాలను కూడా వీడియో రూపంలో వినవచ్చు. ఇలా ప్రతి సిలబస్ వద్ద కూడా బార్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. భాష పుస్తకాల్లో ఎటువంటి మార్పులు లేవు. సోషల్, సైన్స్, మ్యాథ్స్‌లో రెండు భాషల్లో ముద్రించారు.

పంపిణీకి ఏర్పాట్లు



రెండో దశ పుస్తకాల పంపిణీ కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు ల్యాంగ్వేజెస్ మినహా దాదాపు 80శాతం పుస్తకాలు వచ్చాయి. మరో వారం రోజుల్లో అన్ని పుస్తకాలు వచ్చే అవకాశం ఉంది. అన్ని పుస్తకాలు వచ్చాక వీలైనంత త్వరగా పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తాం. రెండు భాషల్లో పుస్తకాన్ని ప్రింట్ చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

ప్రయోజనం..



పాఠశాలల్లో విద్యార్థులకు రెండో దశ పుస్తకాల పంపిణీకి ఇప్పటికి 85శాతం జిల్లాకు చేరాయి. త్వరలో ఎస్ఏ–2 పరీక్షలు ఉన్నాయి. అవి పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఇస్తాం. రెండు భాషల్లో పుస్తకాలు రావడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

విద్యుదాఘాతంతో మహిళ మృతి



చాగాపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- మృతదేహంతో సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ ఫెయిల్ కావడంతో విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలంలోని షాబాద్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని షాబాద్ చెందిన పెద్దింటి ఆటో నవరమ్మ (45) తెల్లవారుజామున ఇంటి ఆవరణ శుభ్రం చేస్తుండగా ఇంటి ముందున్న ఐరన్ మెట్లకు తగలడంతో షాక్‌కు గురై కేకలు వేస్తూ పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం ఆమెను కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గ్రామంలో ఎర్తింగ్ సమస్య ఉందని ఎన్నిసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, మృతురాలి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు మృతదేహంతో చాగాపురం సబ్‌స్టేషన్‌ను ముట్టడించి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మహిళ బలైపోయిందని నిరసన వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో ఇటిక్యాల పోలీసులు వారికి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. ఘటనపై మృతురాలి భర్త ఆటో తిమ్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు పేర్కొన్నారు. దీనిపై ఏఈ వెంకట్రామ్‌ను వివరణ కోరగా ఎర్తింగ్‌లో 5–10 వాట్స్ కరెంట్ మాత్రమే వస్తుందని దీనివల్ల మనిషి చనిపోయేంత పరిస్థితి ఉండదన్నారు. సాధారణంగా 240 వాట్స్ కరెంట్ వస్తుందని గృహోపకరణాల వల్ల ఆమెకు షాక్ తగలలేదని ఇంటి ఐరన్ మెట్లపై ఉండే ఐరన్ కడ్డీల వల్ల షాక్ తగిలిందన్నారు. గ్రామంలో ఏదైనా ఎర్తింగ్ సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేసేందుకు తమవంతు కృషిచేస్తామని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తకోట రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం రాత్రి పట్టణంలోని ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన సంపత్‌కుమార్ ఓ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సొంత ఇల్లు చిన్నదిగా ఉండటంతో అ ఇంట్లో సంపత్‌కుమార్ తల్లిదండ్రులు, సోదరుడు ఉంటున్నారు. కొంత కాలంగా సంపత్‌కుమార్ భార్య పిల్లలతో కలిసి ఎస్సీ కాలనీలోనే ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం అద్దెకు ఉంటున్న ఇల్లుకు తాళం వేసి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నారు. ఆదివారం ఉదయం అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉండటంతో భయాందోళనకు గురైన సంపత్ కుమార్ ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో గల రూ.40వేలు కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సిబ్బందితో కలిసి పరిశీలించారు.



అంగన్‌వాడీలను పట్టించుకోకపోవడం దారుణం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుష్పలత

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ఆదివారంతో 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిల్లె గోపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలన్న ప్రధాన డిమాండ్లను ఆమోదించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమ్మెకు కార్మిక, ప్రజా, రైతు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని తెలిపారు. ఎన్ని రోజులైనా మొక్కవోని ధైర్యంతో పోరాడి విజయం సాధించాలని, చావు, రేవు కేసీఆర్‌తో తేల్చుకోవాలని, మేమంతా మీకు అండగా ఉంటామని అన్నారు. అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, ప్రధాన కార్యదర్శి పుష్పలత మాట్లాడుతూ 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె గురించి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ వైఖరి వీడి డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో రాములుయాదవ్, సాంబశివుడు, కురుమూర్తి, గోనెల రాములు, వరద గాలన్న, విజయవర్ధన్‌రాజు, మాణిక్యంరాజు, కేశవులు, సాధన, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలి



విద్యార్థులను సన్మానించిన క్లబ్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో కింగ్‌షోటోకాన్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని క్లబ్ చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య అన్నారు. ముంబాయిలో వచ్చేనెల 1 నుంచి ప్రారంభమయ్యే అంతర్జాతీయ కరాటే పోటీలకు వెళ్తున్న కింగ్‌షాటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థులను ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండొచ్చన్నారు. క్లబ్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ ముంబాయిలో జరిగే పోటీలకు అండర్–18 పైబడి విభాగంలో అర్ష్ జమీల్ (బ్లాక్‌బెల్టు), అండర్–18 విభాగంలో ఉజేఫ్ షరీఫ్ (బ్రౌన్ బెల్టు), అమాన్‌ఖాన్ (బ్రౌన్ బెల్టు), సాయి ప్రణీత్ (బ్రౌన్‌బెల్టు), మహ్మద్ సాబేర్‌పాష (బ్రౌన్ బెల్టు), అవేజ్ (గ్రీన్‌బెల్టు), అమాన్‌అలీ (గ్రీన్ బెల్టు), తౌహిద్ అహ్మద్ (ఆరెంజ్‌బెల్టు), మారియబేగం (బ్లూబెల్టు) పోటీపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహమూద్ అలీ సనా, జహంగీర్‌పాష, రఫీక్ పటేల్, జకీ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మధాతు లోపంతో పత్తికి నష్టం



ప్రస్తుతం సాగులో ఉన్న పత్తిపంట

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వానాకాలం పత్తిపంటలో సూక్ష్మధాతు లోపంతో నష్టం చేకూరే అవకాశం ఉంది. పంట పసుపు రంగులోకి మారి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. రైతులు ముందస్తుగా చేపట్టాల్సిన నివారణ చర్యలను ఈ విధంగా వివరించారు.

- మెగ్నీషియం పోషక లోపం ఉన్నప్పుడు ముదురు ఆకుల అంచుల నుంచి మధ్య భాగం పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎండు బారి రాలిపోతాయి. ఈ లోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో కనిపిస్తోంది. మెగ్నీషియం లోపం నివారణ కోసం పంట వేసిన 45నుంచి 75రోజుల తర్వాత లీటర్ నీటిలో 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను రెండు సార్లు పిచుకారీ చేయాలి.
- జింక్ లోపం ఉన్న మొక్క, ఆకుల మధ్య కనిపిస్తోంది. ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి.. కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. సేంద్రియ పదార్థం తక్కువైనా నేలలో సున్నంపాలు లేదా భాస్వరం ఎక్కువగా ఉన్న ఈ లోపం కనిపిస్తోంది. జింక్ లోపం నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ వేయాలి. లేదా పంట మీద జింక్ లోపం లక్షణాలు గుర్తించిన వెంటనే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 5 లేదా 6 రోజుల వ్యవధిలో 2నుంచి 3 సార్లు పిచుకారీ చేయాలి.
- బోరాన్ పోషక లోపం వల్ల కొత్తగా పెరిగే చివరి మొగ్గలు దెబ్బతింటాయి. మొగ్గల పెరుగుదల ఆగిపోతుంది. పక్క మొగ్గల నుంచి అనేక కొమ్మలు వచ్చి మొక్క చివర గుబురుగా కనిపిస్తోంది. ఆకులు, కాండాలు, చివరి మొగ్గలు, రంగు, రూపాలు మారిపోయి అన్ని భాగాలు ముతక, దలసరి, పెలుసుగా ఉండి కుళ్లిపోయినట్లు కనిపిస్తే అది బోరాన్ లోపం అని గుర్తించవచ్చు. బోరాన్ లోప నివారణకు పంట వేసిన 60 నుంచి 90 రోజుల తర్వాత లీటర్ నీటిలో 1గ్రాము బోరాక్స్ కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు సార్లు పిచుకారీ చేస్తే తగ్గిపోతుంది.



మెగ్నీషియం లోపంతో పసుపు రంగులోకి మారిన పత్తిపంట (ఫైల్)

తాగునీటికి తిప్పలే..

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు కరువైన సౌకర్యాలు

- మన్ననూర్, ఉడిమిళ్ల, వటువర్లపల్లి, అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలల్లో బోరు నీరే దిక్కు
- ఐటీడీఏ అధికారులకు పట్టని సమస్యలు



మన్ననూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాల, నీటి ట్యాంకు

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొన్నిపాఠశాలల్లో కనీసం తాగేందుకు నీరు కూడా సక్రమంగా లభించని పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి నిల్వ చేస్తున్న నీటి ట్యాంకులను శుభ్రం చేసేవారు లేక తాగే నీటిలో బ్యాక్టీరియా చేరుతోంది. వర్షాకాలం నేపథ్యంలో కలుషితమైన నీటిని తాగి విద్యార్థులు తరచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. జిల్లాలోని గిరిజన పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పర్యవేక్షణ కరువు..

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కరువైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలను సైతం కల్పించలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అమ్రాబాద్ మండలం జంగిరెడ్డిపల్లిలో విద్యార్థులకు భోజనం వండేందుకు ఏర్పాటుచేసిన రైస్ స్టీమ్ బాయిలర్లు పని చేయక మూలకే పడి ఉన్నాయి. చాలాచోట్ల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా నీరు అందటం లేదు. టాయిలెట్లు, బాత్‌రూంలు సరిపడా లేక విద్యార్థులు నిత్యం సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాగునీటికి బోరునీళ్లే దిక్కు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 చోట్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణను ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షిస్తోంది. జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్, జంగిరెడ్డిపల్లి, ఉడిమిళ్ల, వటువర్లపల్లి, అచ్చంపేట మండలం సిద్ధాపూర్, అచ్చంపేట, లింగాల మండలం అప్పాపూర్, బోనాల, చెంచుగూడెం, లింగాల, క్యాంపురాయవరం, అప్పాయిపల్లి గ్రామాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటితో పాటు మన్ననూర్ ప్రభుత్వ బాలికల పాఠశాల, లింగాల పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోకి తెచ్చారు. అయితే వీటి పరిధిలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మన్ననూర్, ఉడిమిళ్ల, వటువర్లపల్లి, అప్పాపూర్ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన తాగునీటి సౌకర్యం లేదు. అయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బోరు ద్వారానే విద్యార్థులకు తాగునీటిని అందిస్తున్నాయి. ఇటీవల మన్ననూర్‌లోని బోరు చెడిపోయి నీరు మురికిగా వచ్చాయని, ఆ నీటిని తాగాకే అస్వస్థతకు గురయ్యామని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు హాస్టల్‌లోని ఫుడ్ శాంపిళ్లను సేకరించారు. రిపోర్టు వచ్చాకే సరైన కారణం తెలుస్తోందని చెబుతున్నారు.



- ఇది జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాల. ఈ పాఠశాలలోని విద్యార్థులకు తాగునీటి కోసం అందిస్తున్న మిషన్ భగీరథ నల్లా నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో ఎక్కువగా ఇక్కడి బోరు నీటినే వినియోగిస్తున్నారు. ఇటీవల పాఠశాలలోని 50 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రుల్లో చేరిన సంగతి తెలిసిందే. అయితే ఇక్కడి బోరులోని మోటారు చెడిపోవడంతో పాటు మురుగుగా మారిన నీటి కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మూడు రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి..

పాఠశాలలు, కళాశాలల్లో తాగునీటి కోసం వినియోగించే ట్యాంకులను ప్రతి 3 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి. ట్యాంకుల్లో నాచు, బ్యాక్టీరియా వృద్ధిచెందకుండా జాగ్రత్తలు పాటించాలి. జిల్లాలోని పాఠశాలల్లో ఆహార నాణ్యతపై తరచుగా తనిఖీలు చేపడుతున్నాం. మన్ననూర్ ఘటన నేపథ్యంలో శాంపిళ్లను సేకరించాం. 10 రోజుల్లో రిపోర్టు వచ్చాక నిర్ణయం తీసుకుంటాం.

– మనోజ్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, నాగర్‌కర్నూల్

తాగునీటికి ఏర్పాట్లు చేశాం..

జిల్లాలోని మొత్తం 15 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేశాం. మిషన్ భగీరథ నీరు అందుబాటులో లేనిచోట్ల బోరు ద్వారా తాగునీటిని అందిస్తున్నాం. అప్పాపూర్‌లో సోలార్ విద్యుత్తు ద్వారా బోరు నీరు అందుతోంది. అన్నిచోట్ల స్వచ్ఛమైన నీరు, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కమలాకర్‌రెడ్డి, జిల్లా గిరిజనసంక్షేమ శాఖ అధికారి)

క్లుప్తంగా...

గుండెపోటుతో విద్యార్థిని మృతి



ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి.పల్లవి (16) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. తొలుత విద్యార్థిని గుండెపోటుతో బాధపడుతుండటంతో వెంటనే అధ్యాపకులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పల్లవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ.

డిసెంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు/సహాయ వ్యయ పరిశీలకులు/ వ్యయ పర్యవేక్షణ బృందాలు/ రిటర్నింగ్ అధికారులు/సెక్టార్ అధికారులకు వేర్వేరుగా శిక్షణ, జిల్లాలకు నిధుల కేటాయింపు, అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన ధరల ఖరారు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్/స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్స్/వీడియో సర్వేలియన్స్ టీమ్‌ల ఏర్పాటు తదితర పనులన్నీ వచ్చే అక్టోబర్‌నెలలోగా పూర్తి చేయాలని సీఈఓ కార్యాలయం నిర్దేశించుకుంది.

నవంబర్‌లో..

నవంబర్‌లో వివిధ స్థాయిల్లోని పోలీసు అధికారులకు శిక్షణ, పోలింగ్ సిబ్బందికి నియామక ఆదేశాల జారీ, సోషల్ మీడియాపై పర్యవేక్షణ, ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్, వ్యయ పరిశీలకులకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల ప్రకటన, వికలాంగులు/80 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించడానికి ఫారం 12డీ దరఖాస్తుల స్వీకరణ, సీ-విజిల్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల స్వీకరణ, పెయిడ్ వార్తలపై సమీక్ష, ఎన్నికల్లో వినియోగించేందుకు సమీకృత ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్/కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, బ్యాలెట్ పత్రాల ముద్రణ, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ, ఈవీఎంలకు రెండో ర్యాండమైజేషన్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ/స్వీకరణ తదితరాలన్నీ పూర్తి చేయాలి.

డిసెంబర్‌లో..

డిసెంబర్ నెలలో పోలింగ్ సిబ్బందికి తుది శిక్షణ, పోలింగ్ కేంద్రాలకు రవాణా సదుపాయ కల్పన, పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం అమ్మకాలపై నిషేధం, పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలి.

గల్ఫ్.. ప'రేషన్'

- ఈ-కేవైసీకి ఇప్పటికిప్పుడు రాలేమని వలస కార్మికుల ఆందోళన
- లేకపోతే రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగిస్తారనే భయం
- గల్ఫ్ దేశాల్లో పనిచేసేవారి సంఖ్య 15 లక్షలకు పైగానే...
- ప్రభుత్వం వీరి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందో...!



మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో పనిచేసే వలసకార్మికులు ఇప్పుడు పరేషాన్‌లో పడ్డారు. రేషన్‌కార్డుల్లో పేరు ఉన్న ప్రతి ఒక్కరు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ సూచించిన విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ యంత్రంపై రేషన్ వినియోగదారులు వేలిముద్ర వేసి తమ ధృవీకరణ పూర్తి చేయాలి. రాష్ట్రంలోని వినియోగదారులు ఏ ప్రాంతంలో ఉన్నాసరే సొంతూరుకు వెళ్లకుండానే ఈకేవైసీ పూర్తి చేసే వెసులుబాటు కల్పించారు. పొరుగు రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్నవారు మాత్రం స్వరాష్ట్రానికి వచ్చి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ-కేవైసీ ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. అయితే దీనికి నిర్ణీత గడువు తేదీని మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. వీలైనంత త్వరగా రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న వారితో ఈకేవైసీ పూర్తి చేయించాలని అధికారులు రేషన్‌డీలర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక కుటుంబంలోని సభ్యులు వేర్వేరు చోట్ల ఈకేవైసీ పూర్తి చేయించుకోవడానికి అవకాశముంది. ఈ విధానంతో పట్టణాలకు ఉన్నత చదువులకు వెళ్లినవారు, ఉపాధి పొందుతున్న వారు తాము ఉంటున్న పరిసరాల్లోనే ఈకేవైసీ పూర్తి చేయించుకోవచ్చు. కానీ గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన వారు ఇప్పట్లో వచ్చే అవకాశం లేకపోవడంతో వారి ఈకేవైసీ ఎలా అనే సంశయం నెలకొంది. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం ఈకేవైసీ చేయించుకోని వారి పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించే ప్రమాదముంది. విదేశాలకు వెళ్లినవారు సంవత్సరాల తరబడి స్వదేశానికి దూరంగానే ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాతైనా ఈకేవైసీ చేయించుకోవచ్చా? అనే విషయంపై స్పష్టత లేకపోవడమే ఈ గందరగోళానికి కారణం. స్థానికంగా నివాసం ఉండనందుకు రేషన్‌బియ్యం కోటా తమకు దక్కకపోయినా ఇబ్బంది లేదని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగించవద్దని అని వలస కార్మికులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమపథకం అమలు చేసినా రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటుంది. ఇలాంటి తరుణంలో తాము ఉపాధి కోసం సొంతూరిని విడచి వేరే ప్రాంతానికి వెళ్లామని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగిస్తే ఎలా అని వలస కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణవాసుల సంఖ్య 15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈకేవైసీ నిబంధనతో వలస కార్మికులు అధిక సంఖ్యలో నష్టపోయే ప్రమాదం ఉంది. వలస కార్మికుల అంశంపై తమకు ఎలాంటి స్పష్టత లేదని నిజామాబాద్ పౌర సరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాశ్ 'సాక్షి'తో చెప్పారు. ఈకేవైసీ గడువు మూడు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందన్నారు.

పేర్లు తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి

ఈకేవైసీ పూర్తి చేయని వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి. వారు సొంతూరికి వచ్చిన తర్వాత ఈకేవైసీ అవకాశం కల్పించాలి. వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తే వారు ఏ ప్రభుత్వ పథకానికి అర్హులు కాకుండా పోతారు. ప్రభుత్వం పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

సూర్య, చంద్ర ప్రభలపై కోనేటిరాయుడు



తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం నాడు ఉదయం సూర్యప్రభపై ఊరేగుతూ మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవల్లో భజన బృందాల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవంలో గరుడ సేవ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన వాహనంగా శ్రీవారి రథోత్సవాన్ని చెప్పవచ్చు. సోమవారం ఉదయం 6.55 గంటలకు మలయప్ప మహారథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగనున్నారు.

ఏసీబీ వలకు చిక్కిన మావల తహసీల్దార్

- పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణకు రూ.20 లక్షలు డిమాండ్
- రూ. 2 లక్షలు ముట్టజెబుతుండగా ఆర్‌ఐతో పాటు పట్టివేత
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మావల తహశీల్దార్ ఆరిఫా సుల్తాన, ఆర్ఐ హన్మంత్‌రావు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్ఐ హన్మంత్‌రావు ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. మావల పట్టణ శివారులోని వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం రైతుల నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్ తోపాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నంబర్ 181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలు ఉన్నాయి. వీరు యతేంద్రనాథ్ యాదవ్‌ను రిప్రజెంటర్‌గా ఉంచారు. పట్టా పాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023, ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆరీఫా సుల్తానాను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో ఆర్ఐ హన్మంత్‌రావు వారిని రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని సూచించగా, యతేంద్రనాథ్ ఈ నెల 21న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో డబ్బులు ముట్టజెబుతుండగా ఏసీబీ అధికారులు తహసీల్దార్, ఆర్ఐలను పట్టుకున్నారు. వీరిని కరీంనగర్ ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

దళిత యువతిపై దాడి

- ప్రేమ పేరుతో వేధించి హత్యాయత్నం చేసిన యువకుడు
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి
- ఆందోళనకు దిగిన దళిత సంఘాలు



జక్రాన్‌పల్లిలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

జక్రాన్‌పల్లి: ప్రేమ పేరుతో దళిత యువతిని వేధించి, హత్యాయత్నానికి పాల్పడ్డాడో యువకుడు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. జక్రాన్‌పల్లికి చెందిన దళిత యువతిని అదే గ్రామానికి చెందిన ఓ ముస్లిం యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. శనివారం రాత్రి ఆమెను బలవంతంగా తన బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో యువతి ప్రతిఘటించి బైక్‌పై నుంచి కిందకు దూకింది. దీంతో ఆగ్రహించిన సదరు యువకుడు మద్యం మత్తులో యువతిని కొట్టి రోడ్డు పక్కన పడేశాడు. ఆమెను గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

గ్రామంలో ఆందోళన..

యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి దళిత సంఘాల ప్రతినిధులు, బాధిత యువతి కుటుంబ సభ్యులు గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. జక్రాన్‌పల్లి అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్హులకు దళిత బంధు ఇవ్వాలి

వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో

మోత్కూరు: అర్హులైన దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని కోరుతూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలోని చౌరస్తాలో వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై దళితులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడారు. పేద దళితులను కాదని ఆర్థికంగా ఉన్నవారికి దళిత బంధు మంజూరు చేశారని ఆరోపించారు. ఒక కుటుంబంలో ముగ్గురు ఆడకూతుళ్లను కలిగిన ఓ నిరుపేద దళిత కుటుంబానికి ఇవ్వక పోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాహం కాని యువకులకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన వారికి దళిత బంధు ఇవ్వాలని ఆందోళనకు దిగితే పోలీస్ కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. ఆందోళనలో బర్రె వెంకటయ్య, చింత నర్సయ్య, ఉప్పల నరేశ్, రాజు, మాతంగి నరేశ్, చలివేంద్ర అండాలు, మాతంగి ఎల్లమ్మ, కిష్టయ్య, మంజుల పాల్గొన్నారు.

పసి హృదయముంటేనే కవి

'అనితరుడు'పుస్తకావిష్కరణ సభలో గోరటి వెంకన్న



అనితరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, తదితరులు

కరీంనగర్‌కల్చరల్: పసి హృదయమున్నవాడు మానవవాద కవిగా విలసిల్లుతాడని ప్రజావాగ్గేయకారుడు, శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కవి మువ్వా శ్రీనివాస్‌రావు రచించిన 'అనితరుడు'పుస్తకావిష్కరణ సభకు ఆయన హాజరయ్యారు. ధర్మాధర్మాలను కవులు ప్రజలకు బాధ్యతాయుతంగా వివరించాలని సూచించారు. పసితనం, ప్రజాక్షేత్రాలను వీడిన కవిలో సృజనాత్మకత సన్నగిల్లుతుందన్నారు. సున్నిత మనస్కుడైన కవిగా వైవిధ్యభరితమైన అభివ్యక్తితో మువ్వా శ్రీనివాస్‌రావు కవిలోకంలో వెలుగొందుతున్నారని అభినందించారు. కవి నగ్నముని మాట్లాడుతూ...తెలంగాణలో సాహిత్య కార్యక్రమాలకు కరీంనగర్ కేంద్రంగా వాసికెక్కుతుందన్నారు. 366 మంది 'విమర్శ వ్యాసా'లతో వెలువడిన ఈ పుస్తకం భావి పరిశోధకులకు దిక్సూచిగా ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాసాలు రాసిన నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, దామెర రాములు, గోపగాని రవీందర్, వెంకటేశ్వర్లు కె.అంజయ్యను జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి మళ్లీ వరద ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రానికి క్రమంగా 20వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరిరూపంలో 90, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 724, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 100, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 123 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 4,263 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులో 27.48టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 19,503 క్యూసెకుక్కల ఇన్‌ఫ్లో ఉండగా, 9,349 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతార కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం వెయ్యి, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 ద్వారా 852, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

శ్రీశైలంలో 853.3 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 853.3 అడుగుల వద్ద 87.6562 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,742 క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,025, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.117 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 204 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 54 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

గొర్తవరి ఎండింది

- వర్షాధార వరికి గడ్డు పరిస్థితి
- ఆందోళనలో అన్నదాత



గట్టు శివారులో ప్రస్తుతం వర్షాల్లేక ఎండిన గొర్తవరి

గట్టు: నడిగడ్డ ధర్మపంటగా పిలువబడే గొర్తవరి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆస్మాన్ తరి (ఆకాశం నుంచి జాలు వారే చినుకులకు పండే వరిపంట) వర్షాబావంతో ఎండు ముఖం పట్టింది. కేవలం వర్షాధారంగా గట్టు, కేటిదొడ్డి, ధరూరు మండలాల్లో సాగు చేసే గొర్తవరి పంట ఎండుతోంది. ఈ ఏడాది వానాకాలం ప్రారంభం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఆగస్టు మాసంలో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో గొర్తవరికి గడ్డు పరిస్థితులు మొదలయ్యాయి. పొట్టదశలో వర్షాలు లేక పోవడంతో గొర్తవరి ఎండుకుంటు వస్తోంది. సకాలంలో వర్షాలు కురిస్తే సెప్టెంబర్ చివరి నాటికి గొర్తవరి కొతకు వచ్చేది. వానాకాలం ప్రారంభంలో జూన్ రెండో వారం నుంచి జూలై రెండో వారం వరకు గొర్తవరి రైతులు వర్షాలకు అనుగుణంగా వరిని విత్తుకుంటుంటారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారీ లేకుండా, కేవలం వర్షాధారంగా వరిని ఇక్కడ పండిస్తుంటారు. విత్తుకున్న 95 రోజులకు వరి పంట కోతకు వస్తుంది. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడి వస్తుంది. గట్టు మండలంలో సుమారు 3500 ఎకరాల్లో గొర్తవరి సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వర్షాధారంగా గొర్తవరిని పండించడం ఇక్కడి ప్రత్యేకత. సాగు వసతి కారణంగా నీటి కాల్వలు రావడంతో గొర్తవరికి బదులుగా కొందరూ రైతులు వరి నాట్లు వేస్తున్నారు. సాగు నీటి వసతి లేని గట్టు పడమర, ఉత్తరం భాగాలు, తారాపురం, జోకన్‌గట్టు, సల్కాపురం, రాయాపురం, యల్లందొడ్డి, మాచర్ల గ్రామాలతో పాటు కేటీదొడ్డి మండలం చింతకుంట, సోంపురం, యర్సన్‌దొడ్డి, మల్లాపురం, మల్లాపురంతండా, కుచినేర్ల గ్రామాల్లో ఇప్పటికి గొర్తవరిని రైతులు సాగు చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి సంగతి అటుంచితే కనీసం తిండి గింజలు కూడా దక్కే పరిస్థితి లేదని గొర్తవరి సాగు చేసిన రైతులు వాపోతున్నారు.

వర్షపాతం వివరాలు 2023

నెల	సాధారణంగా కురవాల్సింది	కురిసిన వర్షం	వర్షం కురిసిన రోజులు
జూన్	61.1	54.3	5
జూలై	106.8	199.9	13
ఆగస్టు	95.4	77	6

వర్షపాతం వివరాలు 2022

నెల	సాధారణంగా కురవాల్సింది	కురిసిన వర్షం
జూన్	61.1	19
జూలై	106.8	230.9
ఆగస్టు	95.4	184.6

పాలమూరంతా పారుతూ.. లక్షల ఎకరాలకు సాగునీరు



సన్మానం పొందుతున్న కవులు

- కృష్ణాజలాలపై వెల్లివిరిసిన కవిత్వం

కందనూలు: ఉమ్మడి పాలమూరు జిల్లా కవులు కృష్ణాజలాలపై కవితాగానం వినిపించారు. కృష్ణా జలాల పంపిణీతో ఉమ్మడి జిల్లా పాలమూరంతా ప్రవహిస్తూ.. మొత్తంగా పారి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, పంటపొలాలు, సస్య శ్యామలమయ్యాయని, ఆకలి చావులు, ఆత్మహత్యలు ఆగిపోయాయని, వలసలు నిలిచిపోయాయని రైతులు పంటల సంపదలతో తులతూగుతూ తమ జీవన ప్రమాణాలు పెరిగాయని కవులు తమ కవితలతో వినిపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'పాలమూరు– రంగారెడ్డి' ఎత్తిపోతల పథకంతో తరలివస్తున్న కృష్ణా జలాలపై ఉమ్మడి పాలమూరు జిల్లా కవి సమ్మేళనం వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు.

బీడుభూములన్నీ పంటపొలాలై..

కవి సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకురాలు ఎ.జయంతి, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి, పత్రికావేత్త మధుకర్, ఏషియన్ న్యూస్ సంపాదకులు ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, విద్యావేత్త భాస్కర్ రావు, సాహితీవేత్త వీరయ్య, డి. రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కృష్ణాజలాలతో కేఎల్ఐ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలతో బీడుభూములన్నీ పంటపొలాలై, పచ్చని పరుపులు అయ్యాయని అన్నారు. చెరువులు, కుంటలు, కాల్వలు జలమయమై, సాగునీరు, తాగనీరు పుష్కలమై, కటకట కరువు అంతమై, ఈ ప్రాంత రైతులు వ్యవసాయ కూలీల, చేతివృత్తుల వారి జీవితాలు మారిపోయి, ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. కృష్ణా జలాలతో ప్రజల స్వయం అభివృద్ధి, వ్యవసాయ అధారిత పనులన్నీ చేస్తున్నారని, క్రమ క్రమంగా అభివృద్ధి అవుతున్నారని అభిప్రాయపడ్డారు. ఈ ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటాల కృషితో, ఎన్నో ఉద్యమాలు, ఆమరణ నిరాహార దీక్షలు, త్యాగాలతో, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కృషితో, ఈనాటికీ సాధ్యమై, పాలమూరు జలదృశ్యం ఆవిష్కృతమైతుందని కవులు తమ కవితా గానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, బోల యాదయ్య, బైరోజు శ్యాం సుందర్, దేవదానం, అంబటి భానుప్రకాష్, బైరోజు రాజశేఖర్, తాటి కృష్ణ, కేపీ లక్ష్మీనరసింహ, గన్నోజు శ్రీనివాస్, గడ్డంపల్లి భూపాల్ రెడ్డి, మందాపురం సుజాత, శీనయ్య దాదాపు నూటాయాభై మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో కందికొండ మోహన్, వహీద్ ఖాన్ కల్వకోల్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అధరహో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు విశేష పూజలు, అన్నదానాలు, భజనలతో ఆయా ప్రాంతాలు మార్మోగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం పలుచోట్ల వినాయకులు నిమజ్జనానికి తరలగా.. లడ్డూలకు నిర్వహించిన వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. రికార్డు స్థాయిలో వేలంపాడి గణనాథుడి లడ్డూలను కైవసం చేసుకున్నారు.



గోదల్‌లో రూ.1.52 లక్షలు..

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని గోదల్‌లో గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు ఆదివారం వేలం పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన వావిలాల రాజేశ్వర్ రెడ్డి రూ.1,50,2,116లకు దక్కించుకున్నారు. – బల్మూర్



కౌకుంట్లలో రూ.1.21 లక్షలు..

మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్లలోని నేతాజీనగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన బాలబ్రహ్మచారి రూ.1,21,116లకు దక్కించుకున్నారు. – దేవరకద్ర రూరల్



లడ్డూ @ రూ.1.03 లక్షలు..

వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో పెద్దమ్మగుడి వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన గొంది భాస్కర్‌రెడ్డి రూ.1,03,000కు కైవసం చేసుకున్నారు. – పాన్‌గల్